క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సూరారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పితృ వియోగంతో బాధపడుతున్న మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు సత్తి శ్రీనివాసరెడ్డి, కొండారెడ్డి సోదరులను ఆదివారం అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా దివంగత సూరారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.

సూర్యదేవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీవారు, తీర్థ ప్రసాదాలు, అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

సీతానగరం: పిన్ని ఇంటికి కూర పట్టుకెళ్లిన బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించినట్టు పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మునికూడలిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుమారు 11 ఏళ్ల బాలికను ఆమె తల్లి పొరుగు వీధిలో ఉంటున్న తన పిన్ని ఇంట్లో కూర పెట్టిరమ్మని పంపించింది. పిన్ని ఇంట్లో లేకపోవడంతో ఆ బాలిక తన వెంట తాళం పట్టుకెళ్లింది. తాళం తెరిచేందుకు యత్నించగా, అది రాకపోవడంతో.. పక్క ఇంట్లో ఉంటున్న 38 ఏళ్ల వ్యక్తిని తాళం తెరవాలని కోరింది. తాళం తీసిన ఆ వ్యక్తి.. బాలికను అనుసరించి ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ బాలికపై లైంగిక దాడికి యత్నించడంతో.. ఈ హఠాత్పరిణామానికి భీతిల్లిన ఆ బాలిక అతడి నుంచి తప్పించుకుని కేకలు పెడుతూ ఇంటి నుంచి బయటకు పరుగెత్తింది. స్థానికులు అక్కడకు చేరుకోవడంతో ఆ వ్యక్తి పరారయ్యాడు. ఈ మేరకు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పోక్సో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రాజరాజేశ్వరిదేవికి కుంకుమ పూజ

కోరుకొండ: మండలంలోని కాపవరం సెంటర్‌లో ఉన్న రాజరాజేశ్వరిదేవి తల్లికి ఆదివారం కుంకుమ పూజ, మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నీరుకొండ వర్ధనవిజయ భాస్కరరావు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ 24వ వార్షికోత్సవం జరిగింది. అందరికీ అమ్మవారి ఆశీస్సులుండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

అనపర్తి : మండలంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం శంకుస్థాపనలు చేశారు. రామవరంలో గొడ్డు కాలువకు సంబంధించి ఆరు చోట్ల రిటైనింగ్ వాల్ నిర్మాణం, ఎస్సీ కాలనీలో నల్ల కాలువకు డ్రెయిన్‌తో పాటు, అనపర్తిలో అన్నా క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపనలు నిర్వహించారు.

యువతి అప్పగింత

సీతానగరం: తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. ఎస్సై డి.రామ్‌కుమార్ వివరాల మేరకు, సీతానగరం పంచాయతీలోని వెలమపేటకు చెందిన 18 ఏళ్ల యువతి పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైంది. దీంతో ఆమె తల్లిదండ్రులు మందలించి, శనివారం వారు పనులకు వెళ్లిపోయారు. సాయంత్రం తిరిగొచ్చేసరికి వారికి కుమార్తె కనిపించలేదు. తెలిసిన చోట్ల వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు శనివారం రాత్రి యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. ఆదివారం సీసీ కెమెరాలు పరిశీలించి, ఆ యువతి రాజమహేంద్రవరంలోని తన స్నేహితురాలి ఇంటికి వెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు ఆ యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆనంద సరోవరం

- ఆహ్లాదపరుస్తున్న రావుల చెరువు పార్కు
- చిన్నారులు, పెద్దలతో నెలకొంటున్న సందడి
- గత ప్రభుత్వ హయాంలో మారిన రూపురేఖలు



విద్యుద్దీపాల వెలుగుల్లో రావుల చెరువు పార్కు



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

రాజానగరం: జాతీయ రహదారిని అనుకుని ఉన్న రాజానగరం పేరు వినగానే వెంటనే గుర్తు కొచ్చేది రావుల చెరువు. ఎందుకంటే ఈ చెరువు కారణంగానే గ్రామావిర్భావం జరిగిందని పెద్దలు చెబుతుంటారు. దశాబ్దాల తరబడి రాజానగరం వాసులకే కాకుండా, పరిసరాలలోని 15 గ్రామాల ప్రజలకు దాహార్తిని తీర్చిన చెరువుగా కూడా దీనికి పేరుంది. అటువంటి చెరువు వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకొచ్చే మలినాలతో పాటు, పరిసరాలలో నివాసం ఉంటున్న వారు పోసే చెత్తాచెదారాలతో కలుషితమైపోయింది. చెరువును ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకురావాలని రెండు దశాబ్దాలుగా ప్రజలు పాలకులను మొత్తుకుంటున్నా.. పట్టించుకున్నవారు లేరు.

జక్కంపూడి రాజా చొరవతో..

ఈ క్రమంలో 2019 ఎన్నికలలో ఎమ్మెల్యేగా విజయం సాధించిన జక్కంపూడి రాజా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చెరువు ప్రక్షాళన చేసి, పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేశారు. సుమారు రూ.రెండున్నర కోట్ల వ్యయంతో చెరువును ప్రక్షాళన చేసి, గట్టును పటిష్టపర్చడంతో పాటు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వైపు త్రికోణంగా ఉన్న ప్రాంతాన్ని మట్టితో పూడ్చి, అందరినీ ఆకట్టుకునే రీతిలో చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆట పరికరాలతో పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. అలాగే ఆ పార్కుకు చేర్చి పుణ్యతిథులలో స్నానాలు చేసేందుకు వీలుగా పెద్ద పాంచాలను కూడా నిర్మించారు. ప్రస్తుతం ఈ పార్కు గ్రామంలోని పిల్లా, పెద్దలకే కాకుండా, పొరుగు గ్రామాల వారిని కూడా విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇదే పార్కులో జిమ్‌ను కూడా ఏర్పాటు చేయడంతో, ఉదయం, సాయంత్రం వేళలలో వారు వ్యాయామం చేస్తూ శరీరక ఆరోగ్యాన్ని, ధృడత్వాన్ని పెంపొందించుకుంటున్నారు.



పార్కులో చెరువు గట్టున ఏర్పాటు చేసిన ఐ లవ్ రాజానగరం సైన్ బోర్డు

సంతరించుకున్న కొత్త కళ

రావుల చెరువును పూర్తిగా ప్రక్షాళన చేసి, గట్టు చుట్టూ రాతితో పటిష్టపరచడంతో చెరువుకు కొత్త కళ సంతరించుకుంది. అవసరమైన చోట పాంచాలను కూడా నిర్మించారు. అంతేకాక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వైపు.. ఐ లవ్ రాజానగరం పేరుతో ఏర్పాటు చేసిన పార్కు పిల్లల నుండి వృద్ధుల వరకు అందరినీ ఆకట్టుకుంటోంది.

– పద్మకళ, సూర్యరావుపేట

స్వరూపమే మారిపోయింది

ఒకప్పుడు రావుల చెరువుకు, ఇప్పుడు ఉన్న దానికి అసలు సంబంధమే లేదన్నట్టుగా.. చాలా బాగా అభివృద్ధి జరిగింది. సాయంత్రం వేళలో చెరువు గట్టున ఉన్న పార్కు పిల్లలు, పెద్దలతో ఎంతో సందడిగా ఉంటోంది. ఇక్కడకు వచ్చి కూర్చుంటే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

– మనోజ్ సూర్యకుమారి, రాజానగరం

గొయ్యిలో పడిన ఆటో



కుమ్మరి గొయ్యిలో పడిన ఆటో

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఆటో అదుపుతప్పి కుమ్మరి గొయ్యిలోకి పడింది. బస్ స్టేషన్‌ను ఆనుకుని కుమ్మరిగొయ్యి ఉంది. గొయ్యి అంచున ఆటోస్టాండ్ ఏర్పాటు చేసుకున్నారు. ఆటో నిలిపిన తరువాత బస్ స్టేషన్ వద్ద ప్రయాణికులు ఆటో ఎక్కి కూర్చుంటారు. ప్రయాణికులు నిండాక ఆటో బయలుదేరుతుంది. ఆదివారం బస్‌స్టేషన్ వద్ద పెద్దగా ప్రయాణికులు లేకపోవడంతో ఆటో ఖాళీగా ఉంది. ఆటోస్టాండ్‌లో ఉంచిన ఆటో అదుపుతప్పి 20 మీటర్ల లోతున గొయ్యిలోకి పడింది. తుప్పలు ఉండటంతో పది అడుగులకు వెళ్లి ఆగింది. పొక్లెయిన్ సహాయంతో ఆటోను బయటకు తీశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో నియామకం



నల్లమిల్లి కాంతమ్మ



బొడ్డు ముత్యాలరావు



మండ రాజారెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలపై అనపర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు పార్టీ నాయకులకు రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో పదవులు లభించాయి. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా అనపర్తి మండలం పెడపర్తి గ్రామానికి నల్లమిల్లి కాంతమ్మ, బూత్ కమిటీల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రమైన బిక్కవోలుకు చెందిన బొడ్డు ముత్యాలరావు, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామానికి చెందిన మండ రాజారెడ్డి నియమితులయ్యారని వివరించారు. నూతనంగా పదవులు పొందిన వారికి అభినందనలు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు, ఆయా నియామకాలకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు.

క్రొవ్విడి, తాడికి రాష్ట్ర పదవులు



క్రొవ్విడి సర్రాజు



తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి

కోరుకొండ: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో పలువురు నాయకులకు రాష్ట్ర పదవులు కల్పించింది. కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన సీనియర్ నేత క్రొవ్విడి సర్రాజుకు రాష్ట్ర ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగానికి జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. అలాగే కోరుకొండ మండల కేంద్రానికి చెందిన మరో నాయకుడు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డికి ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. పార్టీ అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వీరి సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం వీరికి ఈ పదవులు కట్టబెట్టింది. వీరికి పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.2.50 లక్షల విరాళం



ఆలయ కమిటీ వారికి నగదును అందిస్తున్న కంబాల

కోరుకొండ: మండలంలోని శ్రీరంగపట్నం వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. గోకవరం మండలం తంటికొండ రోడ్డులో ఉన్న సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆలయ కమిటీ వారికి ఈ నగదును అందజేశారు. ఆలయం నీరు కారుతోందని గతంలో ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఈ విరాళం ఇచ్చినట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సావనీర్ ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ద్వారంపూడి వెంకటరెడ్డి తదితరులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 1980–1985 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక ఏఆర్‌సీ కల్యాణ మంటపంలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక నిర్వహించారు. గత జనవరి 17న నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సేకరించిన విద్యార్థుల కుటుంబ సభ్యుల ఫొటోలు, వారి వ్యక్తిగత వివరాలతో సావనీర్ పేరిట ఓ పుస్తకాన్ని రూపొందించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వెంకటరెడ్డి (చింతపండు) పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణ కమిటీ సభ్యులు సబ్బెళ్ల జగ్గిరెడ్డి, దాట్ల కృష్ణంరాజు, కర్రి శ్రీనివాసారెడ్డి, రాయుడు వీరరాఘవులు, పప్పు శ్రీనివాసారెడ్డి, పట్నాల రత్నాచారి, పేరెల్లి సత్యనారాయణ, మిక్కిలి మహేష్, చాగంటి సుబ్రహ్మణ్యం, సత్తి త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనువులమ్మ తీర్థం



వనువులమ్మ తల్లిని దర్శించుకుంటున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: పొలమూరు గ్రామ దేవత వనువులమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనం చేసుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ , మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, వార్డు సభ్యులు ముసలారెడ్డి, నల్లమిల్లి దేవిరెడ్డి, మిల్లు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

ఆపరేషన్ కగార్‌పై న్యాయ విచారణ జరిపించాలి

- ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు
- సింగంపల్లిలో నిరసన కార్యక్రమం



సింగంపల్లిలో నిరసన తెలుపుతున్న ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు

రంగంపేట: కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న మారణ హోమంపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని, స్వతంత్ర న్యాయ కమిషన్‌తో విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం (ఏపీఆర్‌సీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఏపీ ఆర్‌సీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని సింగంపల్లి గ్రామం సీపీ రెడ్డి కాలనీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్‌కౌంటర్‌లో అమరులైన మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు సహా, అమరులందరికీ నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ, ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీని నేటికీ విమర్శిస్తున్న బీజేపీ.. శాంతి చర్చలు కోరుతున్న వారిని కాల్చి చంపుతామని ప్రకటించడం ఏ రకంగా రాజ్యాంగ పాలనో ప్రజలు గమనించాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను బేషరతుగా నిలిపివేసి, మావోయిస్టులతో చర్చలకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మావోయిస్టు నేత నంబాల కేశవరావు సహా, 27 మంది మరణాలను హత్యలుగా భావిస్తూ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం బాధ్యులపై 302 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వీడియో రికార్డింగ్ ద్వారా బంధువుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. మృతదేహాల కోసం కోర్టుకెళ్లే దుస్థితి తలెత్తడం విచారకరమన్నారు. 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ మొదలైనప్పటి నుంచి నంబాల కేశవరావు మృతి వరకు జరిగిన సంఘటలన్నిటిపైనా స్వతంత్ర కమిషన్ ద్వారా సుప్రీం కోర్టు విచారణ జరిపించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, శాంతి చర్చల కమిటీ సభ్యుల మధ్యవర్తిత్వంలో కేంద్రం వెంటనే మావోయిస్టు ఆదివాసీ సీపీసీలో శాంతి చర్చలకు ముందుకు రావాలన్నారు. గడచిన 16 ఏళ్లలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అడవులు, బొగ్గు గనులు, ఇతర ఖనిజ సంపదపై జరిగిన వ్యాపార ఒప్పందాలన్నింటినీ ప్రభుత్వం బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. పరాయి దేశంతో శాంతి చర్చలు జరిపి, ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులతో చర్చలు జరపకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు రెడ్డి దేవి, నాయకులు దేశెట్టి సురేష్, చెక్కా సత్తిబాబు, కొల్లి రాంబాబు, రాయుడు కన్నా, పద్మ, రత్నం, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ర్యాంపుపై ప్రజాభిప్రాయ సేకరణ

సీతానగరం: ములకల్లంకలో నూతన ఇసుక ర్యాంపుపై ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభను అధికారులు ఆదివారం నిర్వహించారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామసభలో గెయిల్ డిప్యూటీ కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్, మైన్స్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయంతోనే నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు. ములకల్లంక రెవెన్యూలోని 14/6, 15/2, 20/7తో పాటు, 16 సర్వే నంబర్లలోని 10.654 హెక్టార్ల భూమిలో 3,19,620 క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలు జరుగుతాయన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో తవ్విన ఇసుకను మునికూడలి ర్యాంపు నుంచి రవాణా చేస్తారన్నారు. ఇసుక తవ్వకాలపై గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పరిశోధన పత్రాల సమర్పణ

రాజానగరం: అంతర్జాతీయ ఆన్‌లైన్ సదస్సులో తమ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు పరిశోధన పత్రాలను సమర్పించారని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రొఫెసర్ వీసీ కేవీబీ రాజు తెలిపారు. అంతర్జాతీయ సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ (ఐఎస్ఈఎల్), ఎంఐటీ ఆర్ట్ డిజైన్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ (పుణే) సంయుక్త ఆధ్వర్యంలో కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్‌మెంట్ (యూకే) సహకారంతో శుక్ర, శనివారాల్లో ఈ సదస్సు జరిగింది. ఏఐ యుగంలో ఈఎల్‌టీ అనే అంశంపై జరిగిన సదస్సులో బీటెక్ విద్యార్థులు కె.యశ్వంత్‌రెడ్డి, ఎం.స్నేహిత్‌బాబు, హర్ష శ్రీవాస్తవ్, మనీష్ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై విశ్లేషణలతో కూడిన పరిశోధన పత్రాలను సమర్పించారు.

ఘనంగా జాతరలు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల, ఇనుగంటివారిపేటల్లో పదకొండేళ్లకు ఓసారి జరిగే అమ్మవార్ల జాతరలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇనుగంటివారిపేట గ్రామ దేవత లంకాలమ్మ అమ్మవారు, ముగ్గళ్ల గ్రామ దేవత పాశాలమ్మ అమ్మవార్ల జాతరలను గ్రామస్తులు వేడుకగా జరిపారు. ఆదివారం అమ్మవార్లను పుట్టింటి నుంచి అత్తింటికి పంపించారు. గ్రామస్తులు అమ్మవార్లకు నైవేద్యాలను సమర్పించారు. దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో కాతేరు–సీతానగరం నాలుగు లైన్ల రోడ్డు వాహనాలతో కిక్కిరిసింది.